431) శుద్ధవసంతం

ప॥ ఏవుపాయములు మాకిక బనికిరావు। నీవే హరి కావవే నిరుహేతుకమున॥

చ॥ యివల నింద్రియజయం బేడ నే నేడ। భువి నింద్రియములతో బుట్టె నీతనువు।
ఆవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ। భవము చంచలమనసు పంగెమే యేడ॥

చ॥ యెలమి గర్మవిముక్తి యేడ నే నేడ। తెలియంగ గర్మాధీన మీబ్రదుకు।
కులికమగుసాత్వికపుగుణ మేడ నే నేడ। కలియుగంబిది యిందు గలవాడ నేను॥

చ॥ తనివోనిఘోరతప మేడ నే నేడా। అనిశంబు నీకు శరణాగతుడను।
యెనలేని శ్రీవేంకటేశ్వరుడ నీబిరుదు। కనుగొనగ శరణాగతపారిజాతం॥